ప్రజల మాట ప్రగతి బాట

పాలేరు నియోజకవర్గం

## బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం


తెట్టెలపాడులో ప్రచారం చేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం, నవంబర్ 24: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని తెట్టెలపాడులో గడపగడపకూ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి కందాళ ఉపేందర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు బిల్లగిరి దనుంజయ, చిర్ర కృష్ణయ్య, గుంటి పుల్లయ్య, పోట్ల వెంకన్న, దొండేటి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులు విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగం

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 24: విద్యార్థుల అభ్యున్నతికి ప్రాజెక్టు వర్క్‌లు దోహదపడుతాయని ఐఏఎస్ అధికారి వెంకటమురళి అన్నారు. మమత రోడ్డులోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రాజెక్టులు విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకునేలా చేస్తాయన్నారు. శ్రీచైతన్య సంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఆర్‌ఐ జయప్రకాశ్, ప్రిన్సిపాల్ శర్మ, రాజ్‌కుమార్, కృష్ణరెడ్డి పాల్గొన్నారు.

## ఎంవీ పాలెంలో రూ.18లక్షల నగదు పట్టివేత

ఖమ్మం రూరల్, నవంబర్ 24: మండల పరిధిలోని యం వెంకటాయపాలెంలో గురువారం రాత్రి రూరల్ పోలీసుల తనిఖీల్లో రూ.18లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామంలో తనిఖీలు చేయగా ఓ ద్విచక్ర వాహనంలో రూ.18 లక్షల నగదు పట్టుబడిందన్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

## కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు

**ఉమ్మడి ఖమ్మంలో 10 స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుచుకుంటుంది**

**బీఆర్‌ఎస్ యువజన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కృష్ణచైతన్య**



ఖమ్మం, నవంబర్ 24: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్‌ఎస్ యువజన విభాగం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపినిచ్చారు. కేసీఆర్ వస్తేనే అభివృద్ధి అని, లేకుంటే అధోగతేనని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 సీట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లాలో అన్ని సీట్లను బీఆర్‌ఎస్ కైవశం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్ హయంలో చీకట్లో మగ్గిన తెలంగాణలో కేసీఆర్ వల్ల వెలుగులు విరజిమ్ముతున్నాయన్నారు. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుతుందంటే ఆ క్రెడిట్ సీఎం కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ వస్తే.. మళ్లీ రాష్ట్రంలో చిమ్మ చీకట్లు కమ్ముకుంటాయని, కాంగ్రెస్ పార్టీని నిలువరించా లని కోరారు. ఎవరెన్ని మాయమోసపు మాటలు చెప్పి మభ్యపెట్టినా మూడోసారి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి తీరుతుందన్నారు. ఎవరు మాటలు చెప్పినా ప్రజలు నమ్మవద్దని, వారు కేవలం మాటలు మాత్రమే చెబుతారని, ఇక్కడ బీఆర్‌ఎస్ నాయకులు నిత్యం ప్రజల కష్ట,సుఖాల్లో ఉంటారని, అలాంటి నాయకులను గెలిపించుకోవాలని తెలిపారు.

## రేపు విశ్వబ్రాహ్మణుల వనసమారాధన

రఘునాథపాలెం, నవంబర్ 24: విశ్వబ్రాహ్మణుల వనమహోత్సవం ఆదివారం ఖమ్మం నగరం గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి వారి మామిడితోటలో నిర్వహించనున్నట్లు ఖమ్మం నగర విశ్వబ్రాహ్మణ వనసమారాధన కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

## బ్రిడ్జి సదస్సుకు ఎస్‌బీఐటీకి ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 24: హైదరాబాద్‌లో డిసెంబర్ 20న నిర్వహించే 55వ బ్రిడ్జి సదస్సుకు ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు ఆహ్వానం అందినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఐసీటీ అకాడమీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శరవాణన్ శుక్రవారం కళాశాల చైర్మన్ కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. కరస్పాండెంట్ డాక్టర్ జీ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజుకుమార్, అకడమిక్ డైరక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 24: నగరంలోని సూర్య హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఓటు హక్కు విలువను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించాలని కోరారు. హెచ్‌ఎం రవితేజ, కలియర్, రమ్య పాల్గొన్నారు.

# పాలేరు ప్రజలే నా బలం.. బలగం

**పాలేరుకే తలమానికంగా జేఎన్‌టీయూహెచ్, నర్సింగ్, ఫిషరీస్ కళాశాలలు**

**ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాం**

**రోడ్‌షో కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే కందాళ**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, నవంబర్ 24: పాలేరు ప్రజలు నా బలం.. బలగం అని ఎమ్మెల్యే, పాలేరు బీఆర్‌ఎస్ నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని బారుగూడెం, ఆరెంపుల, సీతారంపురం, కొండాపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వాహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరెంపుల గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు, కందాళ అభిమానులు భారీ గజమాలతో కందాళను సత్కరించారు. గత పాలకుల హయాంలో పాలేరులో ఎక్కడ చూసినా నెర్రెలు బారిన నేలలో కనిపించేవని, సీఎం కేసీఆర్ పాలన తరువాత పాలేరులో అభివృద్ధి, సంక్షేమం ప్రతి కుటుంబంలో వెల్లివిరిసిందన్నారు. అనతి కాలంలోనే పాలేరుకు ప్రముఖ విద్యాసంస్థలు జేఎన్‌టీయూహెచ్, నర్సింగ్ కళాశాలతో పాటు, మత్స్య కళాశాలను సైతం సాధించుకున్నామన్నారు. కళ్లుండి చూడలేని కాంగ్రెస్ నాయకులు అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారని, ప్రముఖ జాతీయ రహదారుల కూడలిగా ఖమ్మం రూరల్ మండలంగా కొద్ది రోజుల్లోనే మారబోతుందన్నారు. నిత్యం మీ వెంట ఉండే నాయకుడు ఎవరు.. ఎన్నికలు రాగానే కనపడే నాయకుడు ఎవరు.. అనేది ప్రతి ఇంట్లో చర్చ జరగాలన్నారు. ఒక్క ఓటుతో ఐదేండ్ల అభివృద్ధి, సంక్షేమం ఆధారపడి ఉందన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి అఖండ మెజార్టీ అందివ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, ఎంపీపీ బెల్లం ఉమ, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో బీఆర్‌ఎస్ గెలుపు నల్లేరుపై నడకే..

**'లక్ష' మెజారిటీ అధినేతకు కానుకగా ఇద్దాం**

**నిత్యం ప్రజల్లో ఉండే మనిషిని నేను**

**స్థానికేతరులకు అవకాశం ఇవ్వొద్దు..**

**ఎన్నికల ప్రచారంలో అజయ్‌కుమార్**


పాపటపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న టీడీపీ యువకులు


ప్రచారం నిర్వహిస్తున్న పువ్వాడ వసంతలక్ష్మి

రఘునాథపాలెం, నవంబర్ 24: ఖమ్మంలో బీఆర్‌ఎస్ గెలుపు నల్లేరుపై నడకేనని, లక్ష ఓట్ల మెజారిటీ సాధించి అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని ఖమ్మం అభ్యర్థి అజయ్‌కుమార్ ప్రతినబూనారు. శుక్రవారం సాయంత్రం ఆయన పాపటపల్లి, వీఆర్ బంజర, జీకే బంజర గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధిని దేశ ప్రజలు తెలంగాణ వైపు చూస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చి ఆ తరువాత కనపడకుండా పోయే నాయకులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రజల మనిషిగా, మీ కుటుంబ సభ్యుడిగా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని ఉండే అజయ్‌కుమార్‌కే ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అజ్మీర వీరూనాయక్, మాళోతు ప్రియాంక, గుత్తా రవి, చెన్నబోయిన ముత్తమ్మ, పిన్ని సరిత, నాయకులు పిన్ని కోటేశ్వరరావు, ఉయ్యూరు వెంకటనారాయణ, చెన్నబోయిన సైదులు, మందడపు నర్సింహారావు, మందడపు సుధాకర్, మద్దినేని వెంకటరమణ పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన 100 కుటుంబాలు

ఖమ్మం, నవంబర్ 24: ఖమ్మం కార్పొరేషన్‌లో తెలుగుదేశం పార్టీ నుంచి దాదాపు 100 కుటుంబాలు ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చల్లగుండ్ల లెనిన్‌తో పాటు రావూరి సత్యనారాయణ, జూకంటి శంకర్, శివరాం, పసుపులేటి గణేశ్, చాల్లగుండ్ల జ్యోతి, తాటికొండ విజయ్, తాటికొండ రవీంద్రచారి, రాయల రవిచంద్ర, తెన్నేటి ప్రభాకర్‌రావు, తాటికొండ రవి, ఉరిమెళ్ళ హర్షవర్ధన్, వీ భాస్కర్, కిలారు రమేశ్, వేముల రమేశ్, బాబు, తుమ్మలపల్లి మోహన్‌రావు, పాండు, రమా కొత్తపల్లి, నాగమణి, కొరకొప్పుల రమేష్, బానోత్ శ్రీనివాస్, కిన్నెర నరేష్, యం. నాగరాజు, పాపగంటి రమేష్, కే. రవి, పరిటాల లింగరాజు, మోరంపుల పుల్లారావు, కే సుధాకర్ తదితరులు ఉన్నారు.

### అజయ్‌కుమార్ లోకల్..

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 24: నేను ఖమ్మం లోకల్.. ఖమ్మం నా ఊరు కాబట్టి ఇంత అభివృద్ధి చేసిన అని అజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నేను చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందే ఉంది, గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో కేవలం నగర అభివృద్ధి కోసం పనిచేశానన్నారు. బీఆర్‌ఎస్ కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పువ్వాడ వసంతలక్ష్మి ప్రచారం

ఖమ్మం, నవంబర్ 24: ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ ఆయన సతీమణి వసంతలక్ష్మి నగరంలోని 26, 41వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నగరంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలు అందిస్తూ కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# గుర్తింపు కార్డులు సకాలంలో అందాలి

**కలెక్టర్ వీపీ గౌతమ్**


పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, నవంబర్ 24: ఓటరు గుర్తింపు కార్డులు (ఎపిక్ కార్డులు) దరఖాస్తుదారులకు అందేట్లు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 2 లక్షల 27 వేల 608 మందికి కొత్త ఎపిక్ కార్డులు వచ్చాయని, వాటిని పోస్టల్ శాఖచే దరఖాస్తుదారులకు బట్వాడాకు చర్యలు తీసుకున్నామన్నారు. మంగళవారం నాటికి దరఖాస్తుదారులందరికి కార్డులు అందుతాయని తెలిపారు. ఈ-ఎపిక్ కార్డులు ఆన్‌లైన్‌లో డౌన్లోడ్ చేసుకోవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

### పోలింగ్ బూత్‌లను పరిశీలించిన కలెక్టర్

తిరుమలాయపాలెం, నవంబర్ 24: మండలంలోని తిరుమలాయపాలెం, కొక్కిరేణి, పిండిప్రోలులో ఎన్నికల పోలింగ్ బూత్‌లను శుక్రవారం కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల్లో సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూరుశాతం ఓటరు స్లిప్పుల పంపిణీ చేయాలని అధికారులకు వివరించారు. ఆర్అండ్‌బీ జేఈ శ్రీకాంత్, కార్యదర్శులు అజ్మీర బాలా జీ, సునీత, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌కే ముదిరాజుల మద్దతు



మాట్లాడుతున్న పిట్టల రవీందర్ ముదిరాజ్

ఖమ్మం సిటీ, నవంబర్ 24: రాష్ట్రంలో ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే ముదిరాజ్‌ల మద్దతు తెలుపుతున్నట్లు ముదిరాజ్ మహాసభ సలహాదారు పిట్టల రవీందర్ ప్రకటించారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తమ జాతి ప్రజలను తరతరాలుగా మోసం చేస్తూ వస్తున్నదని విమర్శించారు. ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న కాంగ్రెస్‌కు ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ముదిరాజుల రిజర్వేషన్ సమస్యను సుప్రీంకోర్టు నుంచి రాష్ట్ర బీసీ కమిషన్ పరిధిలోకి తీసుకురావడంలో బీఆర్‌ఎస్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటనర్సయ్య ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు రావుల హనుమంతరావు పాల్గొన్నారు.